# తీరని మమతలు

కృష్ణభగవానుని దర్శనం కోరుతూ, పారవశ్యంతో, గోపికలు గొంతులెత్తి గీతికలు పాడుకుంటున్నారు. భవనం లోపలి దీపకళికలకాంతి గోపికల ముక్కునత్తులపైపడి, రంగులు మార్చుకున్నాయి. రకరకాల పువ్వులతో తీగెలు చుట్టుకున్నట్లు గోపికలు భవనం చుట్టూ తిరుగుతూ, మధ్య మధ్య చేతులుతట్టి 'కృష్ణా' అని ఏకకంఠంగా పిలుస్తున్నారు. నల్లని మేఘాలు కృష్ణుని ఉత్తరీయంలా మెరుపుల్ని చుట్టుకుంటూ, అన్ని దిక్కులూ చూస్తున్నాయి. ఆ కాంతిలో గోపికలు కృష్ణుడు తమని వదిలి మిగిలిన గోపికల దగ్గర ఉన్నాడేమోనని కళ్లతో వెతుకుతున్నారు.

మిత్రవింద నిట్టూరుస్తూ, మెట్లపైన కూర్చుంది. 'దేవి, దేవి' అని, వగరుస్తూ, పరిచారికలు ఆసనం మోసుకువచ్చారు.

మిత్రవిందకి గుర్తు వచ్చింది. అది దేవకీదేవి భవనం. అందరికీ సమంగా జరుగుతాయి లాంఛనాలు. దూరంగా గోపికలు పాడేపాట వినబడుతోంది. ఏమిటో, తను పెద్దరాణుల్లోకి చేరలేదు. అల్లాగని మరీ, చిన్న ఆవిడలా, మంకుపట్టుకీ, మందలింపుకీ, నోచుకోలేదు. పోనీ, ఆ గోపికల్లా స్వేచ్ఛగా ఉండేందుకు కూడా వీల్లేదుకదా!

మనస్సుకి చిరాకుగా తోచింది. అటూ ఇటూ తిరిగింది. పరిచారికలకోసం, వాళ్ళు తెచ్చిన ఆసనంపై కూలబడి జడలో మొగ్గలు విడవటం చూచుకుంటూ కూర్చుంది.

భవనం రెండవ అంతస్తు విశాలంగా వుంది. రత్నకంబళ్ళు పరిచి, పువ్వుల పరిమళాలతో, అగరువత్తుల ధూపాలతో, కస్తూరితో చేరిన సుగంధాలు కృష్ణుని ఉనికిని తమలో దాచుకున్నట్లు

ఆ ప్రాంతాన్ని అంతా చుడుతున్నాయి.

సత్యాదేవికి ఓర్పు తగ్గి, కోపంగా మారింది. కాళ్ల అందెల చప్పుడును పెద్దదిచేస్తూ, గదులన్నీ ఎన్నోసార్లు చుట్టింది. పువ్వులు కట్టిన వుయ్యాల ఒంటిగా కదులుతోంది. దూరంగా యమున ఘోషపెడుతోంది. 'ఏమిటీ కోరిక దేవకీ దేవికి?' అనుకుంటూ కృష్ణుడు కూర్చునే స్థానంలో ఉయ్యాల మీద ఒరిగింది.

ఎన్ని అష్టములు జరుపుకోలేదు తనదగ్గర! అయినా మనస్సుకి తృప్తిలేదు.

తను లేకపోతే జీవంలేని శరీరంలా ఉంటుందని ఎన్నిసార్లు చెప్పలేదు! తనదగ్గర ఉన్నప్పుడు ఎంత అమాయకత్వం! అసలు మిగిలినవాళ్లంటే ఇష్టంలేనట్లు తోపిస్తాడు.

ఈసారి ఏమైనాసరే నమ్మకూడదు. అసలు ఈ రాత్రి ఇక్కడికి వస్తాడన్న నమ్మకమేమిటి?

కోపం విచారంగా మారింది. అసలు తన తండ్రిదే తప్పు. తను వేసిన నిందని మార్చలేక తనని కట్టబెట్టటం ఏమిటి? ఎవరికో నిర్ణయించిన పడుచుని తెచ్చుకున్ననాడే అతనిమీద తను ఆశ వదులుకుంది. తన తండ్రికి అదే అలుసుఅయి పిల్లని చూపి, పాతపగలు మరువవచ్చని ఆశ కలిగింది.

తల్లో పువ్వులు బరువెక్కుతున్నాయి. ఒక్కటొకటే ఒలిచి విసురుతోంది.

అబ్బా ఆ రుక్మిణికి ఆత్మలో ఉంటాడుట! అన్నీ వట్టి మాటలు! తనదగ్గర ఉండటం లేదన్న అక్కసుతో ఇలా వెనకచేరి పై అంతస్తులో రెప్పవాల్చకుండా ఆ చూపులేమిటి? పాపం! ఆ చూపులుదాటి రాలేక శూన్యంలోకి చూస్తూ ఉండిపోయాడేమో కృష్ణుడు! ఆ తలపు రాగానే సత్యాదేవికి మనస్సు కొంత స్థిమితపడింది. విచారం దుఃఖంగా మారి తన మీద తనకే జాలికలిగింది.

ఆ రాధలా ఎవరిపడతినో అయివుంటే, ఎంత పరితపించి ఉందును! అవును, అల్లా జరిగివుంటే బాగుండేది. తన్నే నమ్ముకున్నాన్న ఇంగితమే లేని వ్యక్తికి తనగోడు ఎల్లా అర్థం అవుతుంది? తను లేని క్షణంలో కాలం నిలిచినట్టు వుంటుందే- ఆ మాత్రం అర్థం చేసుకోలేడా!

ఈ శూన్యమనసుని ఎల్లా భరించడం? రుక్మిణీ వాళ్ల కులా నా మనసులో ఎందుకు నిలవడు? పోనీ, మనస్సులో నిల్పుకోవడం సాధ్యమయితే ఎంతబాగుండును? రెప్పలు బరువెక్కి, పువ్వులు దులిపిన పొగడచెట్టులా ఉయ్యాలపై లేచి కూర్చుంది సత్యాదేవి.

మూడవ అంతస్తు దేవకీదేవి గది. రుక్మిణీదేవి దేవకి పాదాలదగ్గర కూర్చుంది. యమునానదిని చూసే కృష్ణభగవానుని చూపులో చూపు కలపాలన్న కోరిక మేలిముసుగు వెనక దాచుకుంది రుక్మిణీదేవి. మనస్సు చాలా వెనక్కి వెడుతోంది. చిన్ననాటి కోరికలు కళ్ళల్లో మెదులుతున్నాయి.

అంతలో మనసుకి భీతి కలిగింది. ఆ బ్రాహ్మణుడు నిజంగా వెళ్ళకపోతే తను ఏమయ్యేది? అయినా తన కంత సాహసం ఎల్లావచ్చిందో అన్న ఆశ్చర్యం కలిగింది. తను పంపి వుండకపోతే భగవానుడు వచ్చేవాడేనా? ఆ మాట అననే అన్నాడు. -- 'స్త్రీలోలుడనయి రాలేదు. మీ అన్న గర్వం అణిచేందుకే వచ్చా'నని. అవును, తనేకదా ఊహతెలిసిన దగ్గరనుంచి అతని కథలువిని, అతని రూపం ఊహించుకుని, మనస్సులో మమత పెంచుకుని, చివరికి కన్యకి భూషణమైన బిడియం విడిచి, ఆ విప్రునిముందు తన కోరిక చెప్పిపంపిన దగ్గర నుంచి ప్రతిక్షణం ఏమివార్త వస్తుందోనని మనస్సులోని బాధకి తోడు అన్నచేసే పెళ్లి ప్రయత్నం చూసి జీవితంమీద మమకారం పోవటం, అప్పుడు జరుగుతున్నట్లు తోచి, మనస్సు బరువెక్కి

మొహము ఎరుపెక్కి చూపులు మాధవుని పాదాల దగ్గర చేరాయి.

రుక్మిణీదేవి మనస్సు మళ్లీ కళ్లెం విడిచిన గుఱ్ఱంలా ఎటో పోతోంది. తన కోరిక మన్నించమని కబురుపెట్టి ఉండకపోతే బాగుండేది. తనకోసం కృష్ణభగవానుని బాధపెట్టడం ఏమిటి? ఎప్పటిదో పారిజాతం పువ్వు గుర్తుకు వచ్చింది. నారదుడు పువ్వు ఇచ్చి ఎవరిమీద మక్కువ ఎక్కువో వారికే ఈ పువ్వు ఇవ్వమనటం, కొంతసేపు యోచన చేసి, కృష్ణపరమాత్మ తనకి ఇవ్వటం ఇప్పుడు బాధగా తోచింది. పాపం, సత్యకి ఇవ్వాలని ఉండి ఉంటుంది. కాని, పక్కన ఉండటంతో ఏమిచెయ్యాలో తోచక తనకే ఇచ్చివుండవచ్చు.

తనమీద ఇంతకంటె ఎందుకు గౌరవం ఉంటుది? తను కోరుకొని వచ్చినది అన్నపేరు ఉండనేఉంది. అదృష్టం అంటే సత్యదే అనాలి. అన్ని వేళలా కళ్లయెదుట కట్టుకో గలిగింది. తన మందిరంలో వున్నా ఏదో పరధ్యానంతోనే గడుపుతాడు కృష్ణభగవానుడు. రుక్మిణీ దేవికి ఆలోచనతో మనస్సు దుఃఖంతో నిండింది.

దేవకీ దేవికి కొడుకూ కోడళ్లూ తన మందిరంలో ఉన్నారన్న తృప్తి ఆ సమయంలో కలగలేదు. మనస్సు యమున ఒడ్డున చేరింది. తన తపస్సుకు మెచ్చి పరమాత్మ అవతారం ఎత్తాడు. కాని, తల్లినన్న ఆనందం తనకి ఎక్కడిది? ఆ యశోద చేసిన పూజ గొప్పది! 'అమ్మా!' అన్న బిడ్డని అక్కున చేర్చుకుని, వళ్లుఅంతా కళ్లు చేసుకుని; ఆ మూర్తిని హృదయానికి హత్తుకుని తన్మయం చెందివుంటుంది. పసివాని పలుకులు వినేభాగ్యం తనకి లేదాయె! జగన్మోహన స్వరూపుడి బాల్యం చూడాలన్న వాంఛే కదా తన జన్మకి హేతువ. అయినా ఆ కోరిక తీర్చలేదుకదా! నీ చిన్నారి పాదాలకు చిరుగజ్జెలు కూర్చి, మొలనూలుమువ్వలతో నింపి, చిన్ని శిఖలో తురాయిపింఛము పెట్టి నీ చిలిపి చేష్టలు చూసే భాగ్యం నాకేదీ?

అబ్బా! ఆ చెరసాలలో ఆ భీతి ఎన్ని జన్మలకైనా మరువలేనిది? ఆ పసికందుని నీ కోసం ఆ అధముడి చేతికి అందించాను. నిన్ను ఆ వసుదేవుడు చూడనిచ్చాడనా? అబ్బే నిన్ను నందుని యింటచేర్చాలని నన్ను మరపించి నిన్ను దూరం చేశాడు. నీ ముద్దుమురిపాలు ఏమి చూసుకున్నాను! తల్లిగా కోరి ఆనందించేది పిల్లల పసితనం, బాల్యం. తండ్రికి కొడుకుపై ప్రేమ కౌమారం దగ్గరనుంచి వస్తుందేమో! లేకపోతే వసుదేవుడు తనలా బాధపడలేద, ఎందుచేతో! అబ్బా! తనకి ఏదీ అంటదు. అల్లా ఉండగలిగితే గొప్ప విషయమేగదా! తనని కృష్ణుడు ఈ క్షణంలో ఎల్లా అడిగాడో. 'ఇప్పుడు పసివాడని' కాదా! అని అడిగినట్లు చూశాడు. చూడటమేమిటి -- అడిగినట్లు వింటేను! పసివాడు కింద పడతాడేమో!

దేవకీ దేవికి ఏదో భ్రాంతి కమ్మింది. ఒక్క పరుగున కృష్ణుని ఆసనం చేరింది. ఏడీ! ఏడీ! కనబడడేం! చుట్టూ చూస్తోంది. దూరంగా యమునానది చీకటిలో చేరి మరీ చీకటి చేసింది. చీకటి ఉప్పెనలా పైకి లేచి పరిసరాలని దాచుకుంటోంది. అందులో తన చిన్ని కృష్ణుడు మెరిసిపోతూ కదలినాడు. నదిపై తేలిరావటం దేవకి చూసి, భ్రాంతి విడిచి, భీతితో, 'తండ్రీ' అంటూ భీరువులా అక్కడ ఉన్న స్తంభాన్ని పట్టుకుంది. అచేతనమయిన వస్తువు కలిగినట్లు, తను పట్టుకున్నది తన కృష్ణుడినేనా? ఏమో? ఏమో మాయ! తను ఇంతకు ముందేగా బాలకృష్ణుని చూసింది! ఇది ఏదో మాయ! కాదు, అదేమాయ! 'ఏదినిజం' అన్నట్లు కృష్ణునికేసి చూసింది. మందిరం అంతా కృష్ణరూపంలా తోచింది. మరుక్షణం అంతా శూన్యంగా తోస్తోంది. గట్టిగా పట్టుకుంది. చేతికి ఏదీ దొరకలేదు. కాని, ఏదో పట్టుకున్న భ్రాంతి వుంది. కృష్ణుడు నవ్వాడు. ఆ నవ్వు యమునానది నురగల్లా తేలిపోతోంది. ✧